నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ఏఎస్పీ అవినాష్ కుమార్

మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా, జూలై 5 : అసాంఘిక శక్తుల ఆట కట్టించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలోని పూలే నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 102 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలు, 4 ఫోర్ వీలర్లు, 3 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ, క్యాప్ కోటా సర్టిఫికెట్ల పరిశీలన

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బాసర, జూలై 5 : ట్రిపుల్ ఐటీ బాసరలో శుక్రవారం ఎన్‌సీసీ, క్యాప్ కోటా సీట్లకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ఆర్జీయూకేటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశానికి ఎన్‌సీసీ, క్యాప్ కోట విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. జాయింట్ కన్వీనర్ డాక్టర్ పావని పర్యవేక్షించారు. అర్హుల జాబితా ను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ అధికారులు డాక్టర్ దత్తు, రాకేశ్‌రెడ్డి, మంతపు హరి కృష్ణ, దస్తగిరి, అడ్మిషన్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షపార్టీల నాయకులు

- బొగ్గు గనులు వేలాన్ని అడ్డుకుంటాం
- అదానీ ఆస్తులు పెంచడానికే పని చేస్తున్న మోదీ
- వామపక్ష పార్టీలు నాయకుల నిరసన
- ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలు

ఎదులాపురం, జూలై 5 : సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతున్నదని, బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటామని వామపక్ష నాయకులు అన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ, సీపీఎంఎల్‌మాస్‌లైన్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదానీ ఆస్తులు పెంచడం కోసం సింగరేణిని కట్టబెట్టేందుకే బొగ్గు గనులను వేలం వేస్తున్నదని ఆరోపించారు. బొగ్గు గనులు వేలాన్ని అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. సింగరేణికే బొగ్గు గనులు అప్పగించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణిని ప్రైవేటీకరించాలనే ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, సీపీఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జగన్ సింగ్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట్‌నారాయణ, వామపక్ష పార్టీల వివిధ కమిటీ సభ్యులు తొడసం భీంరావు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, ఆర్.మంజుల, బొజ్జ ఆశన్న, లంక జమున, శకుంతల, పొచక్క, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, ఇంద్రాజీ, అరుణ్, కుంటల రాములు తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

నిర్మల్ అర్బన్, జూలై 5 : ఇటీవల మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని వామపక్ష పార్టీ నాయకులు ఆరోపించారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం వేలం పాటలు నిర్వహించి అంబానీ, ఆదానీ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు యత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆరు జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి కార్మిక ప్రయోజనాలను దెబ్బతీసేందుకు దుర్మార్గమైన నిర్ణయాన్ని కేంద్రం తీసుకుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎస్ఎన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, నందిరామయ్య, రాజు, రాజన్న, హరిత, సురేశ్, రమేశ్ ఉన్నారు.

నిర్మల్, ఆదిలాబాద్ జడ్పీ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్లు

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నిర్మల్ అర్బన్, జూలై 5 : నిర్మల్ జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలక వర్గం పదవీకాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో గోవింద్ ఇతర అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజర్షిషా

ఎదులాపురం, జూలై 5 : ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఐదేళ్ల పదవీకాలం పూర్తికావడంతో శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్‌కు అధికారులు, మాజీ జడ్పీటీసీలు శుభాకాంక్షలు తెలిపారు.

పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు సన్మానం

ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలకు శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారిని కలెక్టర్ రాజర్షి షా, మాజీ జడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ సన్మానించారు. ఐదేళ్ల పాటు వారు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్, ఆదిలాబాద్ డీఎంహెచ్‌వోలు ధన్‌రాజ్, నరేందర్‌రాథోడ్

డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

కరపత్రం అందజేస్తున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 5: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సూచించారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి, బాలాజీవాడ, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇండ్ల వద్ద నీటి కుండీలు, టైర్లు తదితర వాటిలో నిల్వ ఉన్న మురుగునీటిని పారబోయించారు. పరిసరాల శుభ్రత పాటిస్తే దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, డీపీఎంవో రాజేశ్వర్, ఎంటీఎస్ భువనేశ్వరి, డీఈపీడీ మురళీధర్, హెచ్ఏ ధనుంజయ్, శ్యామల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, జూలై 5 : దోమలతో డెంగీ, మలేరియా, ఫైలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని వాటి నివారణకు ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. డ్రైడేలో భాగంగా పట్టణంలోని కొలిపూరలో పర్యటించారు. పాత కూలర్లు, టైర్లు కొబ్బరి బొండలు, కుండీల్లోని మురుగునీటి పారబోయించారు. మున్సిపల్ తరపున మురుగుకాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 108 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సంవత్సరం కేసులు లేకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమార్‌అహ్మద్, జిల్లా మలేరియా అధికారి ఎం.శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వైద్య, మున్సిపల్ శాఖల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వనమహోత్సవం లక్ష్యాన్ని సాధించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 5: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వన మహోత్సవంపై సంబంధిత శాఖ అధికారులతో జిల్లా స్థాయి మానిటరింగ్, కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించి మొక్కలు నాటాలని, వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని 468 జీపీల్లోనినర్సరీల్లో మొక్కలు వివరాలు తెలుసుకున్నారు. వర్షాలు ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటాలని, గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలు, మున్సిపల్ పరిధిలో కలిసి 46 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఆర్‌డీఏ సాయన్న, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు , డీపీఎంలు, ఏపీఎంలు, ఎంపీవోలు, డ్వామా ఏవోలు, తదితరులు ఉన్నారు. అనంతరం మహిళా శక్తి, ప్లాంటేషన్, ఏకరూప దుస్తులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడం, నర్సరీల్లో మొక్కలు, మహిళా శక్తి ద్వారా చేపడుతున్న 12 రకాల కార్యక్రమ వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఎంలు మోప్మా తదితరులున్నారు.

ఆశ్రమాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, జూలై 5 : ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక పీవో క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆశ్రమాల్లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను, వంట గదులను, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని రోడ్లు, బ్రిడ్జీలకు మరమ్మతులు చేయాలన్నారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలను పనులు పూర్తిచేయాలన్నారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించే విధంగా చూస్తామన్నారు. ఈ సమావేశంలో ఈఈ రాథోడ్ భీంరావు, డీఈలు శివప్రసాద్, నిరంజన్, సుభాష్, హమ్మద్, సంతోష్, నాలుగు జిల్లాల ఏఈలు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, వీహెచ్‌పీఎస్ నాయకులు

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలి
- వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రేమ్‌రాజ్
- కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన

ఎదులాపురం, జూలై 5 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని, లేదంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రేమ్‌రాజ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త ధర్నాలో భాగంగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులతో కలిసి ధర్నా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలవుతున్నా ఆరు గ్యారెంటీల హామీలో భాగంగా దివ్యాంగులకు రూ.6వేలు, ఇతర పింఛన్లు రూ.4వేలు పెంచుతామని ఇంతవరకు పెంచడం లేదన్నారు. సహకార సంస్థలు ఏర్పాటు చేస్తామని, దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాకు సంపూర్ణ మద్దతు పలికిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జమ్లె నాందేవ్, సభ్యులు కనక కిషన్, సంతోష్, బాలాజీ, సతీశ్, అనసూయ, గీతా బాయి, సత్యభామ, స్వాతి, రాధా తదితరులు ఉన్నారు.

అధికారిక లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు

అధికారిక లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎదులాపురం, జూలై 5: జిల్లా కేంద్రం విద్యానగర్‌కు చెందిన ఏఎస్ఐ యూనుస్ ఖాన్ అంత్యక్రియలు శుక్రవారం స్థానిక కబ్రస్థాన్‌లో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఐడీ విభాగానికి చెందిన ఏఎస్ఐ యూనుస్ ఖాన్ విధి నిర్వహణలో ఉండగా హైదరాబాద్‌లో సెప్టిన్ బస్సులో గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం రాత్రి భౌతికకాయాన్ని జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. శుక్రవారం జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీ ఎల్ జీవన్ నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో హైదరాబాద్ సీఐడీ ఎస్పీ భూక్యారాంరెడ్డి, ఆదిలాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఆదిలాబాద్, నిర్మల్, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో రిటైనింగ్ రూములు ప్రారంభం

రిటైనింగ్ రూములను ప్రారంభిస్తున్న దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఎన్.సుబ్బారావు

ఎదులాపురం, జూలై 5 : ప్రయాణికుల సౌకర్యార్థం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో రిటైనింగ్ రూములను ప్రారంభించినట్లు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఎన్.సుబ్బారావు తెలిపారు. గుడ్‌పుడ్ క్యాటరింగ్ సర్వీసెస్, ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించే రిటైనింగ్ రూమ్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంతి కోసం బస చేయాలనుకునే వారి కోసం అన్ని హంగులు, వసతులతో కూడిన గదులను రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. సౌలభ్యాలతో పాటు భద్రత ఉంటుందని, వీటిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాందేడ్ స్టేషన్ ఆఫీసర్ రాహుల్‌యాదవ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌పవార్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ పాశ్వాన్ తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్ : మాన్కాపూర్‌కు రోడ్డు సౌకర్యం లేక కాలినడకన వెళ్తున్న వైద్యులు, సిబ్బంది, గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

5 కిలోమీటర్లు నడిచి..వైద్యం అందించి..

బజార్‌హత్నూర్, జూలై 5 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల గ్రామమైన మాన్కాపూర్‌కు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో 5 కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లి వీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది శుక్రవారం వైద్య సేవలందించారు. డాక్టర్ భీంరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఓ గర్భిణికి నెలలు నిండడంతో సరైన రోడ్డు సౌకర్యం లేక బజార్‌హత్నూర్ వీహెచ్‌సీకి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో సూర్య ప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ఏఎన్ఎంలు అన్నపూర్ణ, శ్రీలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదు చేయాలి

పంటల వివరాల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

నేరడిగొండ, జూలై 5 : వానాకాలం పంటల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని అధికారులను ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బొందిడి గ్రామ శివారులోని పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి అధికారి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రతి పంటనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు తప్పకుండా ఏ ఈవోల ద్వారా తమ పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదు చేయడంతో మార్కెటింగ్‌లో ఇబ్బందులుండవని తెలిపారు. ఇక్కడ ఏవో భాస్కర్, ఏఈవో మహేందర్, రైతులు శ్యాంరావ్, పరశురాం, జనార్దన్ ఉన్నారు.